# ఆశాజనకంగా పట్టుగూళ్ల ధరలు

- రోజూ 'పురం' మార్కెట్‌కు 2,600 నుంచి 3,500 క్వింటాళ్లు
- క్వింటాల్ రూ.600 పైనే పలుకుతున్న ధరలు



హిందూపురం మార్కెట్‌లో విక్రయాలకు రైతులు తెచ్చిన బైవోల్టిన్ పట్టుగూళ్లు

**హిందూపురం:** పట్టుగూళ్ల మార్కెట్‌లో ధరలు ఆశాజనకంగా పెరుగుతున్నాయి. నాలుగు నెలల క్రితం వరకూ అంతంతా మాత్రంగా ధరలు ఉన్నా.. ఊహించని రీతిలో పుంజుకుని డిమాండ్ పెరిగి ధరలు రెండింతలు అవుతున్నాయి. ఇదే రీతిలో మరింతగా ధరలు పెరుగుతాయని పట్టుగూళ్ల మార్కెట్ అధికారులు చెబుతున్నారు.

**నాలుగు నెలల తర్వాత..**

రాష్ట్రంలోనే పేరొందిన పట్టుగూళ్ల మార్కెట్లలో ఒక్కటైన హిందూపురం మార్కెట్‌లో పట్టుగూళ్లకు ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. గత నాలుగు నెలలుగా తగ్గిన ధరలు తిరిగి పుంజుకున్నాయి. అయితే ప్రస్తుతం విపరీతమైన చలిగాలులు, తెగుళ్ల దిగుబడిపై ప్రభావం చూపుతున్నాయని, దీనివల్ల నాణ్యమైన పంట చేతికి అందటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్‌కు రోజూ 6 నుంచి 7 వేల క్వింటాళ్లకు పైబడి పట్టుగూళ్లు వచ్చేవి. ప్రస్తుతం చలిగాలులు, తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గి 3,359 నుంచి 2,689 క్వింటాళ్లకు దిగుబడి తగ్గిపోయిందని మార్కెట్ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం హిందూపురం మార్కెట్‌లో గరిష్టం అత్యధికంగా క్వింటాలు రూ.630 నుంచి సగటుగా రూ.580 వరకూ ధరలు పలుకుతున్నాయని రైతులు చెబుతున్నారు. హిందూపురం, మడకశిర, గుడిబండ, సోమందపల్లి, పెనుకొండ, లేపాక్షితో పాటు చిత్తూరు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా పట్టుగూళ్లను తీసుకొస్తున్నారు.

**పట్టుగూళ్ల ధరల పెరుగుదల ఇలా..**

| తేదీలు | | కనిష్టం | గరిష్టం | సగటు |
|---|---|---|---|---|
| 01-9-24 | బైవోల్టిన్ | రూ.333 | రూ.566 | రూ.509 |
| 05-9-24 | బైవోల్టిన్ | రూ.381 | రూ.588 | రూ.526 |
| 10-9-24 | బైవోల్టిన్ | రూ.385 | రూ.631 | రూ.569 |
| 15-9-24 | బైవోల్టిన్ | రూ.522 | రూ.633 | రూ.604 |
| 22-9-24 | బైవోల్టిన్ | రూ.413 | రూ.680 | రూ.607 |

### జాగ్రత్తలతోనే పట్టుగూళ్ల నాణ్యత



ప్రస్తుతం మార్కెట్‌లో పట్టుగూళ్ల ధరలు పెరుగుతున్నాయి. అయితే డిమాండ్‌కు అనుగుణంగా సప్లయ్ ఉండటం లేదు. ఈనెల నుంచి ధరలు పెరిగాయి. రైతులు చలికాలంలో పట్టుగూళ్ల పెంపకంలో జాగ్రత్తలు పాటిస్తే నాణ్యతగా ఉత్పత్తి పెరగడానికి అవకాశం ఉంటుంది. బెడ్ గదుల్లో గాలి వెలుగుతురు వచ్చేలా చూసుకుని పట్టు పురుగులకు వైరస్ సోకకుండా చూసుకోవాలి. చాలామంది రైతులు గాలిలో తేమను తగ్గించాలని సున్నం ఎక్కువగా వాడుతారు. సున్నం గాలిలో తేమను పిల్చుతుందని ఎక్కువ సున్నం వేస్తారు. తద్వారా తేమను ఎక్కువగా పీల్చి బెడ్ అంతా మరింత తేమను పెంచేయడంతో 6వ రోజు లేదా గూడు అల్లే వరకు సున్నం వేయకూడదు. లేకపోతే తేమ ఎక్కువై గూడు డిం అవుతుంది. చిన్న ఈగలు బెడ్‌లోకి వెళ్లి కుళ్లిన పదార్థాలు తింటుంటాయి. వాటిని అరికట్టడానికి జీరో మెస్ వేస్తారు. దీనివల్ల గాలి కూడా ఎక్కువ గదిలోకి రాదు. గాలి వెలుతురు తక్కువైతే దోమ ఉధృతి పెరుగుతుంది. దోమలబారిన కాపాడుకోవడానికి రైతులు గదుల్లో గాలి లోనికి వచ్చి బయటకు వెళ్లేలా చూసుకోవాలి. ఈ జాగ్రత్తలు పాటిస్తే పట్టుగూళ్ల పెరిగి నాణ్యతగా వస్తాయి.

– లక్ష్మిరెడ్డి, పట్టుగూళ్ల మార్కెట్ అధికారి, హిందూపురం

### ధరలు ఆశాజనకంగా ఉన్నాయి



పట్టుగూళ్ల సాగు కోసం రైతులు ఎన్నో వ్యయ ప్రయాసాలకోర్చి సాగు చేస్తున్నారు. రెండు నెలల క్రితం వరకూ సరైన ధరలు లేవు. గత నాలుగు నెలల నుంచి ఎంత కష్టపడినా మేలు రకమైనా గూళ్ల పండించిన కిలో ధర రూ.400 దాటేది కాదు. ఇప్పుడు ధరలు కొంతబాగున్నాయి. అయితే పట్టుగూళ్ల సాగుకు చలి, తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గుతోంది. చలిగాలల కారణంగా గూళ్లల్లో నాణ్యత తగ్గి దిగుబడిపై ప్రభావం చూపుతోంది.

– అంజన్‌రెడ్డి, చప్పరాళ్లపల్లి, మడకశిర

### పట్టుగూళ్లకు డిమాండ్ పెరిగింది



మార్కెట్‌లో నాణ్యమైన బైవోల్టిన్ పట్టుగూళ్లకు మంచి డిమాండ్ పెరుగుతోంది. డిమాండ్ అనుగుణంగా అధిక దిగుబడి రావడంలేదు. చలితో పాటు తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గుతోంది. పట్టుగూళ్ల సాగుతో పెద్దగా లాభంలేదు. గత నాలుగేళ్ల ధరలు పెరుగుతూ రైతులకు ఊరట నిచ్చాయి. ఇటీవల నాలుగు నెలల నుంచి నష్టాలు చూడాల్సి వచ్చింది. ఇప్పుడిప్పుడు ధరలు పెరుగుతున్నాయి.

– చంద్రా, కె.ఎన్.పల్లి,గుడిబండ

## సబ్‌జైలులో కెమెరాలు ఏర్పాటు చేయండి



హిందూపురం: సబ్‌జైలులో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ శివప్రసాద్‌యాదవ్



పెనుకొండ: సమస్యలు చెబుతున్న ఖైదీలు

- జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జి.శివప్రసాద్‌యాదవ్

**హిందూపురం అర్బన్:** పట్టణ పరిధిలోని ఉప కారాగారం (సబ్‌జైలు)లో ఖైదీలు ఉండే గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జి.శివప్రసాద్‌యాదవ్ జైలు సిబ్బందికి సూచించారు. సోమవారం స్థానిక సబ్‌జైలును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో ఖైదీల కదలికలు తెలుస్తాయన్నారు. జైలులో ఎంత మంది ఖైదీలు ఉన్నారు? ఏఏ కేసుల్లో వచ్చారు, ఖైదీల ఆరోగ్య పరిస్థితిని జైలు సూపరింటెండెంట్ అంజినాయక్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం నేరుగా ఖైదీలతో మాట్లాడారు. క్షణికావేశంలో తప్పు చేసి జైలుకు వచ్చారు. బయటకు వెళ్లిన తరువాత సమాజంలో గౌరవంగా బతకాలని ఖైదీలకు సూచించారు. ఆర్థిక ఇబ్బందులతో న్యాయవాదులను పెట్టుకొనే స్తోమత లేని వారు లిఖిత పూర్వకంగా అర్జీ ఇస్తే ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. అందుతున్న సౌకర్యాలు, భోజనం గురించి ఆరా తీశారు. జైలులో సిబ్బంది ఎవరైనా ఇబ్బంది కలిగిస్తుంటే తమ దృష్టికి తేవాలన్నారు. ఖైదీల కోసం తయారు చేసిన భోజన నాణ్యతను పరిశీలించారు. ఆయన వెంట న్యాయవాది నవేరా, లోక్ అదాలత్ సిబ్బంది శారద, హేమావతి ఉన్నారు.

**పెనుకొండ:** పట్టణంలోని సబ్‌జైలును జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జి. శివప్రసాద్‌యాదవ్ ఆకస్మికంగా సోమవారం తనిఖీ చేసారు. సబ్‌జైల్ బ్యారెక్‌లో టాయిలెట్లు, వంటగది, స్టోర్‌రూంను పరిశీలించారు. అందులోని సౌకర్యాలను నిశితంగా గమనించారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. ఆ తర్వాత ఖైదీలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, పారా లీగల్ వలంటీరు ఉప్పర నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

### కళ్లలో మట్టి కొడుతూ..



టార్పాలిన్ లేకుండా కంకర తరలిస్తున్న టిప్పర్

**హిందూపురం అర్బన్:** పట్టణ పరిసర ప్రాంతాల్లో కంకర తోలే టిప్పర్లు కంకరపై ఎలాంటి పట్ట (టార్పాలిన్) కట్టకపోగా అత్యధిక స్పీడుతో దూసుకెళ్తున్నాయి. దీంతో అటుగా వెళ్తున్న వారి కళ్లలో చిన్న చిన్న రవ్వలు పడుతుండటంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ద్విచక్ర వాహనాలు కళ్లలోకి కంకర పౌడర్ పడుతుండటంతో అవస్థపడుతున్నారు. కళ్లలోకి కంకర పడటంతో ఆస్పత్రులపాలైన వారు కూడా ఉన్నారు. రవాణాశాఖ అధికారులు కంకర, మట్టి తరలించే వాహనదారులు నిబంధనలు పాటించేలా కఠిన చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈవిషయమై జిల్లా రవాణాశాఖాధికారి కరుణ సాగర్‌రెడ్డి దృష్టికి 'సాక్షి' తీసుకెళ్లగా మట్టి, ఇసుక, కంకర తరలించే వాహనదారులు టార్పాలిన్లు వాడాలని ఇప్పటికే పలుసార్లు తెలియజేశామని, ఇకపై రోడ్డుపై టార్పాలిన్లు లేకుండా కనిపించే వాహనదారులపై చర్యలు తీసుకుంటామన్నారు.



మడకశిర వద్ద ఎండిపోతున్న వేరుశనగపంట

### ● ఎండుతున్న ఆశలు

**మడకశిరరూరల్:** నియోజకవర్గంలోని వేరుశనగ రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం వేరుశనగ పంటకు వర్షం ఎంతో అవసరమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రెండు , మూడు రోజుల్లో వర్షం రాకపోతే పంట దిగుబడి పూర్తిగా తగ్గే ప్రమాదం ఉందంటున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఈ ఏడాది దాదాపు 16 వేల హెక్టార్లలో వేరుశనగ పంట సాగు చేశారు. గత నెల రోజుల నుంచి వర్షాలు పడకపోవడంతో వేరుశనగతో పాటు ఇతర పంటలు ఎండిపోతున్నాయి. పంటలు ఎండుముఖం పట్టుతుండడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది.

### ఈ అవ్వ భారమైందా ? !



గుర్తుతెలియని వ్యక్తులు వదిలేసిన వెళ్లిన వృద్ధురాలు

**మడకశిరరూరల్:** మండల పరిధిలోని పెనుకొండ రోడ్డులో తులసీధామ వృద్ధాశ్రమం సమీపంలోని రోడ్డు పక్కన సోమవారం సాయంత్రం ఓ వృద్ధురాలిని గుర్తు తెలియని వ్యక్తులు వదలి వెళ్లారని ఆశ్రమ నిర్వాహకుడు తిమ్మప్ప తెలిపారు. గమనించిన ప్రజలు తమకు తెలియజేయడంతో అక్కడికి వెళ్లి వృద్ధురాలి ఊరు? పేరు.. తదితర వివరాలను అడిగామన్నారు. తనకు ఇద్దరు కుమారులున్నారని వృద్ధురాలి లక్ష్మి తెలిపారని, వారు కదిరిలో ఉన్నట్లు చెబుతోందన్నారు. వెంటనే ఆమె వృద్ధాశ్రమానికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు వచ్చే వరకూ ఇక్కడే ఉండవచ్చని ఆమెకు భరోసా ఇచ్చామన్నారు.

## రెచ్చిపోతున్న ఆకతాయిలు

- స్టార్టర్లు షాక్ కొట్టే విధంగా చేస్తున్న వైనం

**లేపాక్షి:** మండలంలోని కోడిపల్లి గ్రామంలో పంచాయతీ బోర్లకు సంబంధించిన స్టార్టర్‌ల వద్ద కొంత మంది ఆకతాయిలు విద్యుత్ వైర్లను ఉన్న చోట నుంచి మరో చోటికి మారుస్తూ విద్యుదాఘాతానికి గురయ్యేలా చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో పంచాయతీ బోర్లలో నీరు వదలడానికి స్టార్టర్ల వద్దకు వెళ్లేందుకు వాటర్‌మెన్‌లు ఆందోళనకు గురవుతున్నారని చెబుతున్నారు. కోడిపల్లి రోడ్డు పక్కనే రెండు పంచాయితీ బోర్లు ఉన్నాయి. సమీపంలోనే స్టార్టర్లను ఏర్పాటు చేశారు. ఆకతాయిలు రాత్రిపూట స్టాటర్లు వద్దకు వెళ్లి ఉన్న విద్యుత్ వైర్‌ను తొలగించి, ముట్టుకుంటే షాక్ కొట్టేవిధంగా చేస్తున్నారంటున్నారు. వాటర్‌మెన్ సెలవులో ఉన్నప్పుడు అనీల్ అనే వ్యక్తి స్టాటర్ ఆన్ చేయడానికి వెళ్లి విద్యుదాఘానికి గురైనట్లు చెప్పారు. మరో పంచాయితీ బోరుకు సంబంధించిన స్టార్టర్‌ను నాగభూషణ అనే వ్యక్తి ఆన్ చేయడానికి వెళ్లి షాక్‌కు గురయ్యాడన్నారు. ఈ విషయంపై సర్పంచ్ మంజునాథ్ మాట్లాడుతూ నీరు వదలడానికి వెళ్లే వారు విద్యుదాఘానికి గురవుతున్నారని, ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

### పారిశుధ్య కార్మికులకు సన్మానం



కార్మికులను సన్మానించిన దృశ్యం

**పావగడ:** పారిశుధ్య కార్మికుల రుణం తీర్చుకోలేనిదని, వారు అనారోగ్యంతో నలుగుతున్నా పారిశుధ్య సేవలందిస్తూ ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్నారని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ కొనియాడారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన పారిశుధ్య కార్మికుల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పారిశుధ్య కార్మికుల ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుడతామన్నారు. పట్టణంలో తాగు నీటి పథకం కింద జేజేఎం పనులు ప్రారంభిస్తామన్నారు. అనంతరం నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజేష్, ముఖ్యాధికారి జాఫర్ షరీఫ్, ఉపాధ్యక్షురాలు గీతా హనుమంతరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించండి

**పావగడ:** తాలూకా వ్యాప్తంగా నెలకొన్న జీతగాళ్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక జీత విముక్తి కర్ణాటక పదాధికారులు సోమవారం తాలూకా కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి వందలాది మంది జీతగాళ్లు భారీ ర్యాలీగా తాలూకా కార్యాలయం వద్దకు చేరుకున్నారు. జీవిక అధ్యక్షుడు నరసింహమూర్తి మాట్లాడుతూ తాలూకా వ్యాప్తంగా వెయ్యి మందికిపైగా జీతగాళ్లు ఉన్నారని, వారికి గుర్తింపు కార్డులు అందించాలన్నారు. నెలకు రూ.2 వేలు పింఛన్ ఇవ్వాలని తహసీల్దార్ వరదరాజుకు వినతిపత్రం అందించారు.

### 28న మండల సర్వసభ్య సమావేశం

**రొళ్ల:** మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఈనెల 28న సాధారణ మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ కవిత అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆజాద్ తెలిపారు.

### కాకి పంచాయతీ అభివృద్ధికి కృషి

**రొళ్ల:** మండల పరిధిలోని కాకి పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ జేసీఎస్ మండల కన్వీనర్ లోకేష్, సర్పంచ్ లక్ష్మమ్మ, వైస్ సర్పంచ్ రాజు తెలిపారు. గత రెండు రోజులుగా కాకి గ్రామం నుంచి కె.బ్యాడిగెర గ్రామం వరకూ సుమారు మూడు కిలోమీటర్ల మెర రోడ్డుకు ఇరువైపులగా పెరిగిన కంపచెట్ల తొలగింపు ప్రక్రియను జేసీబీతో చేపట్టామన్నారు.

### రఘుకు ఛాయాశ్రీ ప్రశస్తి

**పావగడ:** పట్టణంలోని రఘు ఫొటో స్టుడియో నిర్వాహకుడు, ప్రముఖ ఛాయాగ్రహుడు రఘు ఛాయాశ్రీ ప్రశస్తి అందుకున్నారు. బెంగళూరులోని కర్ణాటక ఛాయా చిత్ర గ్రహకార సంఘం దశ మాసోత్సవాన్ని నిర్వహించారు. డీజీ ఇమేజ్‌లో సాంకేతిక నైపుణ్యతను కనపరచిన రఘుకు ఆ సంఘం నిర్వాహకులు ప్రశస్తిని అందజేశారు. స్థానిక తాలూకా ఫోటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు తిమ్మరాజు, ఉపాధ్యక్షుడు రాయుడు తదితరులు రఘును అభినందించారు.

### ఆగని ఇసుక దందా



ట్రాక్టర్ ద్వారా అక్రమంగా తరలిస్తున్న ఇసుక

**పెనుకొండ రూరల్:** సహజ వనరులైన ఇసుక, మట్టిని అక్రమంగా తరలిస్తు కొందరు అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుక, మట్టిని తోడేస్తూ జేబులు నింపుకుంటున్నారు. మండలంలోని రాంపురం, శెట్టిపల్లి, గోనిపేట, కొండంపల్లి పంచాయతీ గ్రామాల్లోని వంక పరివాహక ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుక రూ.3 వేల నుంచి రూ.4 వేలకు అమ్ముతున్నారు. పట్టపగలే ఇసుక, మట్టి తరలిపోతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. దీనిపై తహసీల్దార్ శ్రీధర్‌ను 'సాక్షి' వివరణ కోరగా ఇసుక తరలింపునకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టానని, పనిభారం వలన అక్రమ ఇసుకపై దృష్టి సారించలేదని పేర్కొన్నారు. త్వరలోనే ఇసుక అక్రమ రవాణాపై స్పెషల్ డ్రైవ్ చేపడతామని వెల్లడించారు.

### కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



ఆస్పత్రిలో ప్రత్యేక వార్డును ప్రారంభిస్తున్న ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

**మడకశిర:** పారిశుద్ధ్యం కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఏరియా ఆస్పత్రి ఆవరణలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఆసుపత్రి ఆవరణంలోని పరిసరాలు శుభ్రం చేయడంతో పాటు కార్మికుల కోసం ప్రత్యేక వార్డును ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరాన్ని కూడా ఏర్పాటు చేశారు. డాక్టర్లు శశిరేఖ, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

### అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ

**అమరాపురం:** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో అదనపు గదుల నిర్మాణానికి ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వాస్పత్రిలో అదనపు గదుల నిర్మాణాన్ని రూ.50 లక్షలతో చేపట్టినట్లు పేర్కొన్నారు.

### రుచికరమైన భోజనాన్ని వడ్డించండి



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంఈఓ

**రొళ్ల:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎండీఎం నిర్వాహకులు మెను ప్రకారం రోజూ రుచికరమైన భోజనాన్ని వడ్డించాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఆర్.వద్రహట్టి, హునిసేంట ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు తనిఖీ చేశారు. తర్వాత ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో గుణాత్మక విద్యను బోధించాలన్నారు. పాఠశాల అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలన్నారు.



## క్లుప్తంగా

### డిప్యూటీ తహసీల్దార్ బదిలీ

**రొళ్ల:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న భాగ్యలక్ష్మీ బదిలీ అయ్యారు. అగళి మండలం సివిల్ సప్లయ్స్ డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె స్థానంలో పుట్టపర్తి తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న షెక్షావలిని రొళ్ల డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ చేశారు. త్వరలోనే ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

### ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



రొద్దంలో మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ మద్దిలేటి

**రొద్దం:** సామాజిక బాధ్యతతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మద్దిలేటి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పలు మొక్కలు నాటారు. స్వచ్ఛ హి సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఏఈ బాధ్యతల స్వీకరణ

**సోమందేపల్లి:** మండల ట్రాన్స్‌కో ఏఈగా పరమేశ్వరరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఈ సంజీవప్ప పరిగి మండలానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఏఈలను సిబ్బంది స్థానిక సబ్‌స్టేషన్ వద్ద సత్కరించారు. ఏఈ సంజీవప్పసేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో విద్యుత్ లైన్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యార్థికి ఆర్థిక సాయం



విద్యార్థి మోహన్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న హెచ్‌ఎం విశ్వనాథ్

**మడకశిరరూరల్:** మండల పరిధిలోని వైబీ హళ్లికి చెందిన కొండప్ప కుమారుడు మోహన్ నీట్‌లో ర్యాంకు సాధించి కర్నూలు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించాడు. ఫీజు చెల్లించడానికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో సోమవారం బుళ్లసముద్రం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విశ్వనాథ్‌ను విద్యార్థి మోహన్ సంప్రదించి ఆర్థిక పరిస్థితిని వివరించారు. దీంతో హెచ్‌ఎం దుబాయ్‌లో ఉన్న వైబీ హళ్లి వైఎస్ జనార్దన్‌రెడ్డిని ఫోన్ ద్వారా సంప్రదించి విషయం తెలిపారు. ఆయన వెంటనే ఫోన్ పే ద్వారా రూ.25 వేలు వేశారు. ఈ మొత్తాన్ని విద్యార్థికి అందజేశారు.

### ఆర్టీసీ బస్టాండ్ పరిశీలన

**సోమందేపల్లి:** మండల కేంద్రమైన సోమందేపల్లిలోని ఆర్టీసీ బస్టాండ్‌ను ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌స్వామి సోమవారం పరిశీలించారు. కొంత కాలంగా బస్టాండ్ వినియోగంలో లేకపోవడంతో శిథిలావస్థకు చేరింది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు సూచన మేరకు బస్టాండ్‌ను పునః ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. రోజూ బస్టాండ్‌లోకి బస్సులు వచ్చేల ప్రయాణికులకు సౌకర్యాలు కల్పిస్తామన్నారు.


### వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**రొద్దం:** మండల కేంద్రానికి చెందిన గోవిందప్ప కుమారుడు, వైఎస్సార్‌సీపీ కార్యకర్త నరసింహమూర్తి (43) గుండెపోటుతో సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహమూర్తి భౌతికకాయం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ మారుతీరెడ్డి, నాయకులు రవిశేఖర్‌రెడ్డి అమీర్, అంజి, సినిమా నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**మడకశిరరూరల్:** బాలింతలు, గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యం పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్ వైజర్ లీలావతి తెలిపారు. మండలంలోని దాసప్పపాళ్యం అంగనవాడీ కేంద్రంలో సోమవారం పంచాయతీస్థాయి పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. పౌష్టికాహారంపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.